క్లుప్తంగా

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి



అరట్లకట్టలో ఒక ఇంటి వద్ద రుబ్బురోలులో నిల్వనీటిని శుభ్రం చేయిస్తున్న సిబ్బంది

కరప: అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. అరట్లకట్ట, గొర్రిపూడి, కరప, ఉప్పలంక తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి కార్యదర్శులకు డ్రై డే గురించి వివరించి అమలుచేయాలన్నారు. గ్రామాల్లోని తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నిల్వనీటిని శుభ్రం చేయించారు. గ్రామ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లి నీరునిల్వ లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శులు రాంజీ, పి.శ్రీనివాసు, వి.సునీల్‌కుమార్, ఎస్‌కె.నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కరప: గ్రామ వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేశారని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు కోరారు. కరపలో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలో కరపలో-4, గొర్రిపూడిలో-2, పాతర్లగడ్డ, గొర్రిపూడి కూరాడ, సిరిపురం గ్రామాల్లో ఒక్కొక్కటివంతు వలంటీర్ల పోస్టులకు ఖాళీలున్నాయన్నారు. అర్హులైనవారు 27వ తేదీలోగా మండలపరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న వాటిని పరిశీలించి, 30న సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు చేస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జూలై ఒకటిన ఇంటిమేషన్ లెటర్ ఇస్తామన్నారు. ఎంపికైన వలంటీర్‌కు మూడో తేదీన శిక్షణ ఇచ్చి, నాలుగో తేదీన పోస్టింగ్ ఆర్డర్ ఇస్తామన్నారు.

జేవీకే కిట్ల పంపిణీ

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను శుక్రవారం పంపిణీ చేశారు. విద్యా కమిటీ చైర్మన్ గీసాల సర్వేశ్వరరావు అధ్యక్షతన వీటిని విద్యార్థులకు అందజేశారు. బీసీ కార్పొరేషన్ చైర్మన్ అనుసూరి ప్రభాకర్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల శ్రీను, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్‌జీలో అవగాహన సదస్సు

నాగమల్లితోట జంక్షన్: స్థానిక పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నన్నయ వర్సిటీ సింగిల్ మేడర్ సిస్టమ్‌పై వర్సిటీ అనుబంధ అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం తెలిపారు. వర్సిటీ నుంచి సీడీసీ డీన్ కె.రమేష్, ప్రొఫెసర్ పి.సురేష్‌వర్మ డీన్ అకడమిక్ అఫైర్స్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగి మేడర్ సిస్టమ్‌ను వివరించారన్నారు.

మహిళలకు కుట్టు మెషీన్ల అందజేత

బాలాజీచెరువు: మహిళలకు స్వయం ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా స్థానిక లయన్స్ క్లబ్ హాలులో 11 కుట్టు మెషీన్లు అందజేశారు. లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ సొంత నిధులతో వీటిని అందజేశారు. కార్యక్రమంలో నేరెళ్ల మురళి, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన యువకుడు

కాకినాడ క్రైం: రైలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు, శుక్రవారం ఉదయం కాకినాడ వైఎస్సార్ వంతెన సమీపంలో ఉన్న చినమార్కెట్ ప్రాంగణానికి అనుకొని ఉన్న రైల్వే పట్టాలపై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 40 ఏళ్ల వయసున్న సదరు వ్యక్తి ఐదున్నర అడుగుల ఎత్తు, చామన ఛాయతో ఉన్నాడు. నీలం రంగు చొక్కా, కాఫీ రంగు ప్యాంటు ధరించి ఉన్న అతడి ఆచూకీ తెలిసిన వారు కాకినాడ రైల్వే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని, లేదా 94407 02328 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్‌ఐ రవికుమార్ కోరారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

కాకినాడ రూరల్: ఏడీబీ రోడ్డులో అచ్చంపేట జంక్షన్ సమీపంలో రేపాక గార్డెన్ వద్ద వాహనం ఢీకొని సామర్లకోట మండలం వీరరాఘవపురం గ్రామానికి చెందిన యువకుడు గిరి వెంకట నూక సుధీర్ (24) మృతి చెందాడు. తిమ్మాపురం పోలీసులు వివరాలు ప్రకారం ఇంటర్ చదివిన వెంకట నూక సుధీర్ తాపీ పనిచేస్తున్నాడు. పని నిమిత్తం రాత్రి ఇంటి నుంచి వచ్చి తెల్లవారు జాము సమయంలో అచ్చంపేట జంక్షన్ నుంచి ఏడీబీ రోడ్డులో నడిచి వెళుతుండగా రేపాక వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. మృతుని సోదరుడు గిరి వెంకట ప్రభ ధనుంజయ్ ఫిర్యాదు మేరకు ఎస్సై నాగార్జున రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ స్వరాజ్యం సాకారం

- సేవాలయాలుగా సచివాలయాలు
- ప్రజల ముంగిటకే ప్రభుత్వ పథకాలు
- వ్యయ ప్రయాసలు లేని సంతృప్తిలో ప్రజలు

కాకినాడ సిటీ: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటుతో సాకారం చేశారు. 119 చదరపు కిలో మీటర్ల పరిధిలో విస్తరించిన కాకినాడ నగరంలో వంద శాతం ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే అది సచివాలయ వ్యవస్థ గొప్పతనమే. రేషన్‌కార్డు మొదలుకొని పింఛన్, సున్నా వడ్డీ, డ్వాక్రా రుణమాఫీ, ఆసరా, చేయూత, విద్యాదీవెన, అమ్మ ఒడి వరకు ప్రతి సేవను చెంతకు వచ్చి అందిస్తున్నారు. ప్రతి నెలా 1వతేదీ ఉదయమే సచివాలయాల సిబ్బంది ఇంటికి వచ్చి పెన్షన్ సొమ్ము అందజేస్తున్నారు. ఎవరైనా లబ్ధిదారుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉంటే అక్కడికి వెళ్లి పెన్షన్ అందిస్తున్నారు వలంటీర్లు.

50 డివిజన్లు.. 101 సచివాలయాలు

మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని 2019 అక్టోబర్ 2న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరప మండలం కరపలో సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. కాకినాడ నగర జనాభా 3.75 లక్షలకు పైగా ఉంది. రూరల్ మండలంలోని పలు ప్రాంతాలను కలుపుకొని 50 డివిజన్ల ప్రజలకు ఏ అవసరమైనా నిర్ణీత వ్యవధిలో 15 నిమిషాల నుంచి 72 గంటల వ్యవధిలో మెసేజ్‌తో కూడిన సమాచారంతో మంజూరు చేస్తున్నారు.



కరపలో గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రారంభిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

నాడు : నాలుగేళ్ల క్రితం ఏ చిన్న ప్రభుత్వ సాయం పొందాలన్నా నెలల తరబడి ఎదురు చూపులు.. సుదూరంలోని ప్రభుత్వ కార్యాలయాలకు చెప్పులరిగేలా తిరగాలి. దళారుల ద్వారా మామూళ్లు సమర్పించుకోవాలి. అయినా పని జరుగుతుందనేది అనుమానమే.

నేడు : సేవ ఏదైనా నిర్ణీత కాల వ్యవధిలో పూర్తవుతోంది. ప్రభుత్వ కార్యాలయాల వెంట తిరగాల్సిన అవసరం లేదు. దళారుల ప్రమేయం లేదు. లంచాల సమస్య లేదు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటే అన్ని రకాల సేవలు లభ్యం.

సచివాలయాల సంఖ్య	101
ఇళ్ల సంఖ్య	85,842
జనాభా	3,75,000
కుటుంబాలు	1.12 లక్షలు
విస్తీర్ణం (చ.కిమీ)	35.75
నాలుగేళ్లలో లబ్ధి పొందినవారు	2,86,671
నగరంలో పెన్షనర్లు	29,000
ప్రతి నెలా పొందుతున్న లబ్ధి	రూ.8 కోట్లు
అమ్మఒడి లబ్ధిదారులు :	82,753 మంది
మూడేళ్లలో పొందిన లబ్ధి	రూ. 11,59,329,000
వసతి దీవెన అర్హులు :	44,334 మంది
నాలుగేళ్లలో పొందిన లబ్ధి	రూ.28.15 కోట్లు

ఇంటి వద్దకే పెన్షన్



నాలుగేళ్ల క్రితం పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఎవరూ పట్టించుకోలేదు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత ఇంటికి వచ్చి వివరాలు తీసుకుని పింఛన్ మంజూరు చేశారు. నెలనెలా ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను.

– కేతవరపు వెంకాయమ్మ, స్వర్ణాంధ్ర కాలనీ, కాకినాడ

విద్యకు సౌకర్యాలు కల్పిస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు



మా పిల్లలు ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్నారు. మా అబ్బాయికి అమ్మఒడి ద్వారా ఎంతో మేలు జరుగుతోంది. వలంటీర్ ఇంటికి వచ్చి ఈ పథకం గురించి చెప్పాడు. ఏటా రూ.15 వేలు స్కాలర్ షిప్ అందుతుంది. జగనన్న సర్కార్‌కు మా కుటుంబం రుణపడి ఉంటుంది.

– వాకా గంగావతి, సాంబమూర్తినగర్, కాకినాడ

సచివాలయాలతో సత్వర సేవలు



సచివాలయాల ద్వారా ప్రజలకు అనేక సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏ సంక్షేమ పథకమైనా 72 గంటల వ్యవధిలో ప్రజలకు అందుతున్నాయి. నేరుగా వలంటీర్లే ప్రజల వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. ఏ సమస్య ఉన్నా సచివాలయం వద్దకు వెళ్తే పరిష్కారమవుతోంది. సచివాలయంలో దాదాపుగా 537 సేవలను ప్రజలకు అందిస్తున్నారు.

– సీహెచ్ నాగనరసింహారావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్

కలెక్టర్, ఎస్పీలను కలసిన ఏఐసీసీ ప్రతినిధులు



కలెక్టర్ కృతికా శుక్లాను కలసిన ఏఐసీసీ ప్రతినిధులు

కాకినాడ సిటీ: ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ నూతన కార్యవర్గం శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిసింది. కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు రిక్కీ గూటం, ప్రధాన కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్, తదితరులు ఉన్నారు.

మండల ఏవోగా చంద్రశేఖర్



చంద్రశేఖర్‌కు బదిలీ ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

కాకినాడ రూరల్: జిల్లా పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అడపా వెంకటసూర్య చంద్రశేఖర్ పదోన్నతిపై రూరల్ మండల పరిషత్ కార్యాలయానికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ అయినట్లు జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆయనకు బదిలీ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ సేవలను జెడ్పీ చైర్మన్ ప్రశంసించారు. ఏపీ పీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ రాష్ట్ర నాయకులు రెడ్డిపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సేవలు ఉచితం

- డీఎల్‌డీఓ నారాయణమూర్తి
- కొమరగిరి పీహెచ్‌సీలో నేమాం విలీనంపై సర్పంచ్ మండిపాటు
- మండల పరిషత్ సమావేశం

కాకినాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష పథకం ద్వారా గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి 11రకాలు సేవలు ఉచితంగా అందజేస్తామని డీఎల్‌డీఓ పాతంశెట్టి నారాయణమూర్తి పేర్కొన్నారు. కాకినాడ రూరల్ మండల పరిషత్ సమావేశం ఎంపీపీ గోపుశెట్టి పద్మజ అధ్యక్షతన శుక్రవారం రమణయ్యపేటలోని కార్యాలయంలో జరిగింది. డీఎల్‌డీఓ నారాయణమూర్తి పాల్గొని జగనన్న సురక్ష పథకంపై సభ్యులకు వివరించారు. జులై 1నుంచి జరగనున్న కార్యక్రమంలో భాగంగా మండలంలో నాలుగు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. శనివారం నేమాం, గంగనాపల్లి గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు రేషన్ కార్డులకు సంబంధించి సమస్యలపై టోకెన్ ఐడీ జనరేట్ చేస్తామని, ఈ సేవలు ఉచితంగా అందుతాయన్నారు. నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా మాట్లాడుతూ రేషన్ కార్డులు, విద్యుత్ బిల్లుల గురించి ఎక్కువ అర్జీలు వస్తాయని, ప్రజలకు న్యాయం జరిగిలా చూడాలన్నారు.



కాకినాడ రూరల్ సమావేశంలో జగనన్న సురక్ష గురించి వివరిస్తున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

ఎంపీపీ గోపుశెట్టి పద్మజ మాట్లాడుతూ సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సహకారంతో మండల ప్రజలకు మెరుగ్గా సేవలందిస్తున్నామన్నారు. ఎంపీడీఓ కె.స్వప్న మాట్లాడుతూ ప్రజలకు మెరుగ్గా సేవలందేలా అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసి ముందుకు సాగుతామన్నారు. నేమాం గ్రామాన్ని పండూరు పీహెచ్‌సీ నుంచి విడదీసి కొమరగిరి పీహెచ్‌సీలో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు చేశారని, దీని వలన తమ గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. తమ గ్రామానికి పండూరు 3కిలో మీటర్ల దూరంలో ఉండగా కొమరగిరి 7కిలో మీటర్ల దూరంలో ఉందని ఆయన పీహెచ్‌సీ వైద్యులను నిలదీశారు. సమావేశంలో శాఖలు వారిగా తహసీల్దార్ మురార్జీ, వ్యవసాయాధికారి సత్యనాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మారుతీరామ్, పీఆర్ డీఈ రామకృష్ణ, హౌసింగ్ ఏఈ నాగభూషణం తదితరులు వివరించారు.



కరపలో వీడియో కాన్ఫెరెన్స్‌ను చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అందరి సమన్వయంతో జగనన్న సురక్ష

కరప: మండల పరిధిలో ప్రజల సమస్యలు తెలుసుకుని, అందరి సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బందితో కలసి విన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అందరి సమన్వయంతో ఈనెల 30న ప్రజాసమస్యలు తెలుసుకుని, వాటిపై గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేయించి, నమోదు చేయించి పరిశీలన అనంతరం ఉచితంగా ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఏఓ గుత్తుల భీమశంకరరావు, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మీ తప్పులను మాపై రుద్దకండి

- ద్వారంపూడిపై అనుచిత వ్యాఖ్యలు తగవు
- మాజీ మేయర్ సుంకర శివప్రసన్న

కాకినాడ: దున్నపోతు ఈనిందంటే దూడను దొడ్లో కట్టేయమన్న చందంగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న విమర్శించారు. తెలుగుదేశం హయాంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు చంద్రశేఖరరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సురేష్ నగర్ పార్కుకు సంబంధించి టీడీఆర్ బాండ్ల జారీ విషయంలో వనమాడి చేసిన వ్యాఖ్యలపై ఆమె మండిపడ్డారు. వాస్తవానికి కాకినాడ సురేష్‌నగర్, లక్ష్మీనారాయణనగర్, జయప్రకాష్‌నగర్ లేఅవుట్లకు సంబంధించి 3.85 ఎకరాల సామాజిక స్థలం అందుబాటులో ఉంటే మరో 1.87 ఎకరాల ప్రైవేటు స్థలాన్ని కూడా కలిపి మొత్తం 5.72 సెంట్ల విస్తీర్ణం కలిగిన స్థలంలో కన్వర్టబుల్ స్టేడియం నిర్మాణానికి టీడీపీ హయాంలోనే ప్రతిపాదన చేశారన్నారు. అప్పటి కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, స్మార్ట్‌సిటీ ఎండీ నగర పాలక సంస్థను సంప్రదించకుండా, సర్వే నివేదికలు, టౌన్‌ప్లానింగ్ రిమార్క్స్ లేకుండానే స్మార్ట్‌సిటీ నిధులతో పనులు కూడా ప్రారంభించారన్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ప్రైవేటు స్థల యజమాని కార్పొరేషన్ యంత్రాంగాన్ని సంప్రదించి తన స్థలంలో స్టేడియం నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. అయితే అప్పటి అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ప్రజాధనం వృథా అవుతుందని భావించిన కార్పొరేషన్ అధికారులు ప్రత్యామ్నాయంగా టీడీఆర్ బాండ్లు జారీ చేయగలమని కోర్టు దృష్టికి తీసుకువెళ్ళగా ఆ మేరకు బాండ్ల జారీకి న్యాయస్థానం ఆదేశించిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకే నగరపాలక సంస్థ సమావేశంలో తీర్మానం చేసి బాండ్ల జారీకి ప్రభుత్వానికి పంపించామన్నారు. కొండబాబు హయాంలో స్మార్ట్‌సిటీ–నగరపాలక సంస్థ మధ్య సమన్వయం లేకపోవడంవల్లే ప్రైవేటు స్థలంలో స్టేడియం నిర్మాణం చేశారన్నారు. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చి టీడీఆర్ బాండ్ల జారీలో ద్వారంపూడి అక్రమాలకు పాల్పడ్డారంటూ కొండబాబు అర్థంపర్థంలేని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. తాజాగా విశాఖ ఎంపీ రాసినట్లుగా చెబుతున్న లేఖపై విలేకరుల అడిగిన ప్రశ్నకు, నిగ్గుతేల్చాల్సిందిగా ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రభుత్వానికి లేఖ రాస్తున్నారన్నారు. పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న

యూజర్ చార్జీలపై దృష్టిపెట్టండి



ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: మెరుగైన పారిశుధ్యసేవల కోసం ప్రతిపాదించిన యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహరావు సిబ్బందికి సూచించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో యూజర్ చార్జీలు, ఆస్తిపన్నుల వసూళ్లపై శుక్రవారం సాయంత్రం శానిటేషన్, రెవెన్యూ విభాగానికి చెందిన అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో హూపర్‌టిప్పర్ వాహనాలను, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ఇంటింటికీ చెత్త సేకరిస్తున్నామని, ఇందుకు అయ్యే లక్షలాది రూపాయల వ్యయాన్ని యూజర్‌చార్జీల ద్వారా మాత్రమే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు బుధవారం ఒకటో సర్కిల్ 3వ వార్డు జయేంద్ర నగర్, బీసీ కాలనీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. మూడు డివిజన్లలో పూడిక తీత పనులను ఏడిసి పర్యవేక్షించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాడెం ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

బాలింతకు ద్వారంపూడి ఆర్థిక సాయం

- అందించిన రాగిరెడ్డి, శివ ప్రసన్న



ద్వారంపూడి తరఫున దుర్గకు ఆర్థిక సాయం అందజేస్తున్న చంద్రకళాదీప్తి, శివప్రసన్న తదితరులు

కాకినాడ: నిరుపేద బాలింతకు ఎమ్మెల్యే ద్వారంపూడి ఆర్థిక సాయం చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. జగన్నాథపురంలో ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించినపుడు దుర్గ అనే గృహిణి తన సమస్యను చెప్పుకొంది. తన భర్త వదలివెళ్లిపోయాడని, తల్లికి పక్షవాతమని, తాను గర్భిణి అని సాయం కోసం అర్థించింది. ఆమె కష్టాన్ని చూసి చలించిన ద్వారంపూడి ఆమెకు ప్రసవం అయ్యాక రూ.5 వేల సాయం చేశారు. బాలింత అయిన ఆమెకు ఐదు నెలలకు రూ.10 వేల చొప్పున ఇస్తానని హామీ ఇచ్చి మొదటి నెల సాయం అందించారు. ఈ మొత్తాన్ని కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ బాధితురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పోష్ కమిటీ సభ్యురాలు కృష్ణప్రియ, మాజీ కార్పొరేటర్లు వెలమల మల్లేశ్వరరావు, కొప్పనాతి నాగసత్యనారాయణ, నరసింహమూర్తి, తదితరులు ఉన్నారు.

దమ్ముంటే ద్వారంపూడిపై పోటీ చెయ్

- పవన్ కళ్యాణ్‌కు ఎస్సీ సర్పంచ్‌ల ఐక్యవేదిక నాయకుల సవాల్



బూరిగ ఆశీర్వాదం

కాకినాడ క్రైం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కొనసాగిస్తున్న వారాహి యాత్రలో ప్రసంగాలు తిట్ల దండకాన్ని తలపిస్తున్నాయని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సర్పంచ్‌ల ఐక్య వేదిక కార్యదర్శి బూరిగ ఆశీర్వాదం విమర్శించారు. యాత్ర చేస్తోంది ప్రజా ప్రయోజనాలకా లేక ప్రజాభిమానం ఉన్న నాయకుల్ని తిట్టేందుకేనా అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థి నాయకుడిగా ఎదిగి, కుటుంబ పరంగా మూడు తరాలుగా, వ్యక్తిగతంగా మూడు దశాబ్దాలుగా ప్రజా సేవలో కొనసాగుతున్న ఎంఎల్ఏ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిని విమర్శించే నైతిక అర్హత పవన్ కళ్యాణ్‌కి లేదన్నారు. దమ్ముంటే కాకినాడలో ద్వారంపూడిపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు.

25న బీసీల బైక్ ర్యాలీ

కాకినాడ: వెనుకబడిన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం జగన్, ఎమ్మెల్యే ద్వారంపూడికి సంఘీభావంగా ఆదివారం కాకినాడలో బీసీలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు ఉభయ గోదావరి జిల్లాల బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పంపన రామకృష్ణ, వైఎస్సార్ సీపీ బీసీసెల్ ప్రాంతీయ సమన్వయకర్త అల్లి రాజబాబు చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వీరు మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక బీసీలను ఉన్నత స్థానంలో నిలబెట్టారన్నారు. కాకినాడలో సీఎం బాటలో పయనిస్తూ ఎమ్మెల్యే ద్వారంపూడి ఎంతో మంది బీసీ నాయకులకు అగ్రపీఠం వేసి పార్టీ పరంగా, నామినేటెడ్ పదవుల్లోను ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అటువంటి నాయకుల పట్ల కొద్ది రోజులుగా కొన్ని రాజకీయ దుష్ట శక్తులు చేస్తున్న దుష్ప్రచారంతో కాకినాడ ప్రాంతంలో బీసీల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి సంఘీభావంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి నగరంలో పెద్దసంఖ్యలో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. అతి త్వరలోనే 'ద్వారంపూడి వెంటే బీసీలు' పేరుతో బహిరంగ సభ కూడా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. విలేకర్ల సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి ప్రసాద్, నగర బీసీ సెల్ అధ్యక్షుడు పేర్ల రజనీకుమార్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, మాజీ కార్పొరేటర్లు జగన్నాథన్ విజయ్‌కుమార్, ఎల్లబోయిన చిన్న, వెలమల మల్లేశ్వరరావు, యాదవ సంఘ అధ్యక్షుడు మన్నే నాగేశ్వరరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఇరుసుమళ్ల విష్ణు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నేతలు పంపన రామకృష్ణ, అల్లి రాజబాబు తదితరులు

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

బోట్‌క్లబ్: దేశ సమగ్రతకు దివంగత డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఎంతో కృషి చేశారని బీజేపీ సిటీ కన్వీనర్ గట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక వెంకట్‌నగర్‌లో ఆ పార్టీ సీనియర్ నాయకుడు దిలీప్‌కుమార్ సదనాని ఆధ్వర్యంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఒకే దేశం ఒకే రాజ్యాంగం అన్న శ్యాంప్రసాద్ ముఖర్జీ ఉద్యమం వృథా పోకుండా ప్రధాని మోదీ ఆయన కలలు సాకారం చేశారన్నారు. నాయకులు మాలకొండయ్య, ముత్తా నవీన్, చుండ్రు శ్రీనివాసరావు, పాద సుబ్బారావు, రంబాల వెంకటేశ్వరరావు, చెక్కా రమేష్ పాల్గొన్నారు.

49వ డివిజన్‌లో..

కాకినాడ రూరల్: 49వ డివిజన్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు యార్లగడ్డ వెంకట్రాయుడు అధ్యక్షతన శుక్రవారం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళులు అర్పించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు పితాని లీలావతి, చోడిశెట్టి రమేష్, అనపర్తి వెంకటేష్ తదితరులు నివాళులర్పించారు.

ఎలక్ట్రిక్ స్కూటీ నుంచి పొగలు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో పార్కింగ్ చేసి ఉన్న ఒక ఎలక్ట్రికల్ స్కూటీ నుంచి శుక్రవారం సాయంత్రం దట్టమైన పొగలు రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. స్కూటీ సీటు కింద భాగంలో ఉండే బ్యాటరీల నుంచి పెద్ద శబ్దంతో పొగలు చిమ్మడంతో పేలుడుతో మంటలు వ్యాపిస్తాయని ప్రజలు భయపడ్డారు. కొద్ది సేపటికే పొగలు తగ్గడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



స్కూటీ నుంచి వెలువడుతున్న పొగ

శ్రీపీఠంలో వారాహి నవరాత్రులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని శ్రీపీఠంలో వారాహి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల 19న ప్రారంభమైన వారాహి నవరాత్రి ప్రత్యేక పూజలు ఆదివారం వరకు జరగనున్నాయి. 26న రాత్రి 8 గంటలకు బగళాముఖి హోమం జరగనుంది. నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం త్రిసూక్త హోమం నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

30 లోపు వడ్డీ లేకుండా పన్ను చెల్లించండి

- డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్

కాకినాడ: ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నును వడ్డీ లేకుండా ఈ నెలాఖరులోపు చెల్లించవచ్చునని డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1 నుంచి పన్ను బకాయిలపై రెండు శాతం వడ్డీ పడుతుందన్నారు. ఇప్పటికే సచివాలయాల వారీగా డిమాండ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. నోటీసులు అందని వారు ఆయా సచివాలయాలకు వెళ్లి డిమాండ్ నోటీసులు తీసుకోవచ్చునన్నారు. ఆదివారం కూడా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, పాత కార్యాలయం, సచివాలయాల్లోని కౌంటర్లలో పన్నులు స్వీకరిస్తామన్నారు.